క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న అభిమానులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వేసవి దృష్ట్యా చిత్తూరు నగరంలోని పీసీఆర్ సర్కిల్‌లో ఆదివారం జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు చలివేంద్రం ప్రారంభించారు. మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాజేష్, తులసీకృష్ణ, జన, అంజాద్, హరితేజ, రెబెల్ జోష్నా, బాలాజీ, ఉదయ్, లోకి, వినోద్, ఉమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ముత్తుకూరులో కార్డెన్ సెర్చ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామంలో ఆదివారం బీఎన్ఆర్‌పేట పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో లక్ష్మీపతి అనే వ్యక్తి ఇంట్లో మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కచ్చితంగా అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు ఉంటాయని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.

వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదానానికి ఆదివారం ఓ దాత నగదు విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన శివకుమార్ రూ. లక్ష నగదును నిత్యాన్నదాన ట్రస్టుకు అందజేశారు. ఆలయ సిబ్బంది దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తాగి బండి నడపరాదు

చిత్తూరు అర్బన్: మద్యం తాగి బండి నడపరాదని, అలా నడిపితే ప్రమాదాలకు గురవుతారని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాదిలో మద్యం తాగి బండినడిపిన వారికి రూ.ఒక కోటి వరకు జరిమానా విధించామన్నారు. బండి నడిపేటప్పుడు నిర్లక్ష్యం వీడి జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డుభద్రత నియమాలను పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి ద్విచక్రవాహనం తాకరాదన్నారు. అలా తాగి మొదటిసారి పట్టుబడితే రూ.10వేలు జరిమానా ఉంటుందన్నారు. రెండో సారి పట్టుబడితే రూ.15వేలు, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఘనంగా కోలాతమ్మ ఆలయ కుంభాభిషేకం



అమ్మవారి సేవలో విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని కోలాతమ్మ ఆలయ కుంభాభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి హారతి అందించారు. ముందుగా హోమాది పూజలు వేద మంత్రోచ్ఛరణలతో సాగాయి.

ఫలితాలు రాకనే అడ్మిషన్ల గోల



సార్ మేము కార్పొరేట్ కళాశాల నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ అబ్బాయిని మా కాలేజీలో చేర్పించండి. ఇప్పుడే రిజిస్టర్ చేయించుకుంటే ఫీజులో 40శాతం తగ్గింపు ఉంటుంది..

ఇంతలో మరో కార్పొరేట్ కాలేజి నుంచి ఫోన్.. మా వద్ద ఏసీ గదులు ఉన్నాయి సార్.. రూ.2వేలు కట్టి మీపేరు నమోదు చేసుకుంటే సీటు రిజర్వ్ అవుతుంది. లేకపోతే సీటు దొరకడం కష్టం సార్..మీరు ఓకే అంటే మా స్టాఫ్ మీ ఇంటి దగ్గరకు వచ్చి మిగతా వివరాలు చెబుతారు.. ఎప్పుడు కలవమంటారు..

ఇది కార్పొరేట్ కళాశాలల పీఆర్‌ఓల విద్యార్థుల తల్లిదండ్రులను వలలో వేసేందుకు వ్యవహరిస్తున్న తీరు.

- గ్రామాల్లో కార్పొరేట్ కళాశాలల దందా ప్రారంభం
- అడ్మిషన్ల కోసం ఆఫర్ల వెల్లువ
- తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్న వైనం

గుడిపాల: ఈ ఏడాదిలో గత నెల మార్చి 17వతేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు ఇంకా విడుదల కాలేదు. కానీ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల అడ్మిషన్ల కోసం వేట మొదలుపెట్టాయి. ఫలితాలు రావడానికి ఇంకా సమయం పడుతోంది. అయినా కార్పొరేట్ కళాశాలల మధ్య నెలకొన్న పోటీతో సాధ్యమైనంత వరకు అడ్మిషన్లు ముందుగానే పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అప్పుడే మొదలైన కార్పొరేట్ దందా

కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లను ప్రారంభించాయి. అందుకనుగుణంగా తమ సిబ్బందిని ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రుల మీదకు వదిలాయి. విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్న ఆయా కార్పొరేట్ సంస్థల పీఆర్‌ఓలు ఎంబీబీఎస్ ర్యాంకులు, ఐఏఎస్, ఐపీఎస్ సీట్లు కళ్లముందే చూపుతున్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల జాబితాను సేకరించుకున్న కళాశాలల సిబ్బంది అడ్వాన్స్ అడ్మిషన్ బుకింగ్‌లు చేసుకుంటున్న వైనం విస్తు గొలుపుతోంది. జిల్లా కేంద్రం, అన్ని ప్రధాన పట్టణాలతోపాటు గ్రామాల్లో సైతం పీఆర్‌ఓలు విద్యార్థుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. రకరకాల ఆఫర్లు, అవకాశాల పేరుతో తల్లిదండ్రులను విసిగించేస్తున్నారు. గుంటూరు, విజయవాడ, తిరుపతి, చిత్తూరులోని కార్పొరేట్ విద్యాసంస్థల సిబ్బంది ఒకరు పోతే ఒకరు విద్యార్థుల ఇళ్ల తలుపులు తడుతూనే ఉన్నారు.

నిబంధనలకు పాతర

నిబంధనల ప్రకారం పదవ తరగతి పరీక్షలు విడుదలయ్యాక ఇంటర్ ప్రవేశాలు తీసుకోవాలి. ఇందుకు ఎలాంటి ప్రచారాలు చేయరాదు. పీఆర్‌ఓల ద్వారా ఆర్భాటపు ప్రచారాలు చేస్తూ, తల్లిదండ్రులను విద్యార్థులను అయోమయానికి గురిచేయరాదు. విద్యాశాఖ నిర్లక్ష్యంతో నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఫలితాలు రాక ముందే కార్పొరేట్ విద్యాసంస్థలు సీట్లు బుకింగ్ చేసుకుంటున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సీట్ల బుకింగ్‌కోసం స్థానిక విద్యాసంస్థల యాజమాన్యాలకు భారీగా తాయిలాలు ప్రకటించినట్లు తెలుస్తోంది. తమ పాఠశాలల్లో పది చదివి పాసైన వారిని కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు నగదో..ఆ మేర సరిపడే వస్తువులో..ముట్ట జెప్పేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పీఆర్‌ఓలే కీలకం

కార్పొరేట్ విద్యాసంస్థలకు అడ్మిషన్లను తీసుకురావడం పీఆర్‌ఓలదే కీలకపాత్ర. జిల్లా, నియోజకవర్గాల కేంద్రాలతో పాటు మండలాల్లో మంచి పేరున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, ఆర్‌ఎంపీ డాక్టర్‌లను పీఆర్‌ఓలుగా నియమించారు. స్థానికంగా వారికున్న పేరు, పలుకుబడిని ఉపయోగించుకొని సీట్లు బుక్‌చేయించుకుంటున్నారు. వీరికి కమీషన్ కూడా ముట్టజెపుతున్నట్లు సమాచారం. పీఆర్‌ఓలు విద్యార్థుల తల్లిదండ్రులకు తమ మాటలతో బురిడీ కొట్టిస్తూ అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. వివిధ కారణాలతో పిల్లలు ఇంటికి వస్తే చెల్లించిన ఫీజు తిరిగి ఇవ్వరన్న విషయం మాత్రం చెప్పడం లేదు. ఇది తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని విద్యావంతులు చెబుతున్నారు.

నోటీస్ బోర్డు

నేడు అంబేడ్కర్ జయంతి

యాదమరి: భారత రాజ్యాంగ సృష్టికర్త బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీపీ సురేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కోణాపల్లి మనోహర్ తెలిపారు. వారు మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కార్యక్రమా నికి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, జెడ్పీ వైస్ చైర్మన్ బి.ధనుంజయరెడ్డి ముఖ్య అతిథిగా వస్తున్నారని చెప్పారు. సోమవారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం వద్ద భారీ కేకు కట్టింగ్ ఉంటుందని చెప్పారు. అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలను సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు మండల దళిత యువజన సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మురుగన్ తెలిపారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీల సంఘం నాయకులు, అంబేడ్కర్ సంఘం నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

మెగా వైద్య శిబిరం

పుంగనూరు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని సోమవారం స్థానిక చింతలవీధిలోని మున్సిపల్ స్కూల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ సహకారంతో గుండె, న్యూరో, కిడ్నీ, క్యాన్సర్‌తో పాటు అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనపరిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, నిర్వాహకులు అభినందించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

గిరింపేటలో ఉన్న కృష్ణవేణి ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 169 మందికి గాను 93 మంది 55.03 శాతం, ద్వితీయ సంవత్సరంలో 188 మందికి 130 మంది 69.15 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు.

మురగానపల్లిలో ఉన్న పీఎస్ఎన్ వివేకానంద కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న జుహితారాజ్ 466, రవళిక 465, రోషిణి, లక్ష్మీప్రసన్న, దీక్షిత్‌కుమార్, సాయి తోషిత్ 464, నక్షత్ర, జ్యోతిష్ 463, బైపీసీలో పౌర్ణమి 404, వరున్ సందేశ్ 396, సీఈసీలో దీప 426, సంజయ్ 423 మార్కులు సాధించారని కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి వెల్లడించారు.

మురగానపల్లిలో ఉన్న శ్రీ వివేకానంద కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న సాయి లహరి 466, బైష్ణవ్ 466, బీన సాయి శ్రీ, బిందు సాయి, మౌనిక, లోక ప్రియ, బాలాజీ 465 మార్కులు, బైపీసీలో గౌతమి 431, జాస్మిన్ 417, సీఈసీలో చందు 465, ఢిల్లీరాణి 465, రిహానా 443 మార్కులు సాధించారని ఆ కళాశాల నిర్వాహకులు మహేంద్రకుమార్, భాస్కర్‌నాయుడు వెల్లడించారు.

మిట్టూరులో ఉన్న అరుణాచల కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న తనూజ 443, భవ్య 427, సదియ 403, బైపీసీలో రేవంత్ 413, జగదీష్ 405, సీఈసీ లో వెంకటాద్రి 419, అర్షియ 414 మార్కులు సాధించారని ఆ కళాశాల నిర్వాహకులు జగన్నాథరెడ్డి వెల్లడించారు.

బీఎన్ఆర్‌పేట కళాశాలకు 68శాతం ఫలితాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం బీఎఆర్‌పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 68 శాతం పరీక్ష ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 61.5 శాతం రాగా 78 మందికి గాను 48 మంది ఉత్తీర్ణత సాధించార న్నారు. సెంకడ్ ఇయర్ ఫలితాల్లో 76 శాతం ఫలితాలు రాగా, 67 మందికి గాను 51 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



మాట్లాడుతున్న గురజాల జగన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ టీచర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. సుందరరాజపురంలోని విజయం విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతామన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ సంఘానికి అధికారిక గుర్తింపు మంజూరు చేసేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌ను అభివృద్ధి చేస్తే టీచర్ల ఉద్యోగోన్నతులు సాధ్యమని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

బైరెడ్డిపల్లె: మండలంలోని నాగిరెడ్డిపల్లె–టీఎస్ కుప్పం గ్రామాల మధ్యలో కొలువై ఉన్న శ్రీసోమేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై గంగాదేవి, పార్వతీదేవి సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టు రథంతో ప్రదక్షిణలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా మట్టల ఆదివారం



గుడిపాల: మట్టలతో వెళుతున్న క్రైస్తవులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. తొలుత ప్రత్యేకంగా అలంకరించుకున్న ఈత మట్టలతో నగర వీధుల్లో ర్యాలీలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన చేశారు. టౌన్‌చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, తెలుగు లూథ్స్ చర్చి, రీడ్స్‌పేట చాపెల్, జాన్‌బాస్కో చర్చిల్లో మట్టాల ఆదివారాన్ని ఉద్దేశించి ప్రబోధకులు ప్రసంగించారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం రోజు మట్టల పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అని ప్రభోదకులు పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా చర్చిలన్నీ కూడా క్రైస్తవులతో నిండిపోయాయి.

ప్రధాన చర్చిల్లో..

గుడిపాల: మండలంలోని పలు ప్రధాన చర్చిల్లో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా బిషప్‌లు, పాస్టర్లు ఆధ్వర్యంలో విశేష ప్రార్థనలు చేశారు. అనంతరం బిషప్‌లు గుడ్ ఫ్రైడే మూడు రోజుల ప్రాధాన్యత, పవిత్రత గురించి వివరించారు. కార్యక్రమాల రాకను సూచిస్తూ వారంలో ముందుకొచ్చే ఆదివారం నాడు మట్టల ఆదివారాన్ని నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తుందన్నారు. ప్రార్థనలనంతరం విశ్వాసులు చేతబూని చర్చిల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

కోదండరాముడి భిక్షాటన ఉత్సవం



సీతాదేవి అలక తీర్చే ఘట్టాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి భిక్షాటనలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరవీధుల్లో ఊరేగించారు. తర్వాత ఆలయ ఆవరణలో సీతాదేవి అలక తీర్చే ఉత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఈ కార్యక్రమం గంటన్నరపాటు సంప్రదాయబద్ధంగా కొనసాగింది. అనంతరం ఈ ఘట్టం విశేషాన్ని పండితులు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాల్, ఈవో సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు. - కాణిపాకం

16 నుంచి పానాటూరులో మహాభారత యజ్ఞం



మహాభారత యజ్ఞానికి ముస్తాబవుతున్న ఆలయం

గుడిపాల: మండలంలో పానాటూరు గ్రామంలో ఈ నెల 16వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు భాగవతారిణి హేమలతచే హరికథా కాలక్షేపం ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి 10 రోజుల పాటు పాండురంగ నాటక మండలిచే వీధినాటకం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు 14న ఉదయం గ్రామంలో అమ్మవారికి అభిషేకం, 15న అంబలిపోయుట, 16న ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, 24వ తేదీ సాయంత్రం బలిబండి కార్యక్రమం, 27వ తేదీన 10 గంటలకు అమ్మవారి కల్యాణం, మే 4న ఉదయం 10గంటలకు దుర్యోధన వధ, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశ పట్టాభిషేకం, మే 5న సాయంత్రం 4గంటలకు వసంతోత్సవం, పొంగళ్లు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

సీజన్‌కు ముందే దుక్కులు చేసుకోండి

- వేసవి దుక్కులతో పంటకు మేలు
- భూమి మరింత సారవంతం
- చీడ, పీడలు నశించే అవకాశం



సీజన్‌కు ముందే వేసవి దుక్కులు చేస్తున్న రైతు



వేసవి దుక్కులు చేసిన పొలం

గుడిపాల: వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. చాలామంది రబీ సీజన్ పూర్తవగానే భూమిని అలా కొంత కాలం వదిలేసి మళ్లీ తొలకరి పలకరించినప్పుడు సాగుకు సిద్ధమవుతుంటారు. చినుకులు కురవగానే దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలో దుక్కులు చేసి ఉంచుకోవడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వేసవి దుక్కులతో ఎండ భూమి లోపలి వరకు బాగా తగిలి చీడ పీడలు నశించే అవకాశం ఉంటుంది. దీంతో పంటవేసే సమయంలో క్రిమికీటకాల బెడద తగ్గుతుంది. ఫలితంగా రసాయన ఎరువుల వినియోగాన్ని అరికట్టవచ్చు.

ఇలా చేయాలి

- వర్షాకాలానికి ముందే భూమిని మూడు దుక్కులు దున్నాలి. ఇలా చేస్తే తొలకరి వర్షాలకు నేల మెత్తబడి భూమిలోకి నీళ్లు ఇంకుతాయి.
- దుక్కులు లోతుగా, అడ్డంగా వాలుగా దున్నుకుంటే వర్షపునీరు భూమిలోకి సక్రమంగా ఇంకి తేమను నిల్వచేసే సామర్థ్యం పెరుగుతుంది.
- దుక్కి దున్ని భూమిని ఎండబెడితే కలుపు మొక్కలు నివారించవచ్చు.
- దుక్కులు చేసేముందు భూమిలో పశువుల పేడ, కంపోస్ట్ ఎరువులు, చెరువు మట్టిని వేయాలి.
- వేసవిలో దుక్కి దున్నితే భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా, తేమలో జీవించే వానపాముల సంతతి వృద్ధి చెందుతోంది. ఇవి భూసార పరిరక్షణకు ఉపయోగపడతాయి.
- లోతు దుక్కులు చేయడం వలన వరిలో కాండం తొలుచు పురుగు, రెప్పవాల్చు పురుగు, లద్దె పురుగు, శనగపచ్చ పురుగులు, మిరపలో కాయతొలుచు పురుగులు నశిస్తాయి.
- ప్రధానంగా ఎండా కాలంలో దుక్కులతో భూమి లక్షణాలు మారి, తొలకరి వర్షాలు పడినప్పుడు విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది.
- వేసవి దుక్కులు వలన భూమి పొరల్లోని కీటకాల గుడ్లు, శిలీంధ్రాలు బయటపడి ఎండవేడిమికి చనిపోతాయి. భూమికి హాని కలిగించే పురుగులు బయటకు వస్తే వాటిని పక్షులు తినేస్తాయి. ఫలితంగా చీడపీడల సమస్య తగ్గుతుంది.
- పొలంలో చెత్తచెదారం ఉంటే లోతుగా దున్నడంతో భూమిలో కలిసి కుళ్లిపోతుంది. ఫలితంగా సేంద్రియ ఎరువుగా మారి భూమికి బలాన్నిస్తాయి.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి కీటకాలు నశిస్తాయి. దీంతో పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం ఉండదు. పంటల కోత తర్వాత అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. నీరు సక్రమంగా భూమిలో ఇంకిపోవడంతో సారవంతంగా ఉంటుంది. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి. రైతులు ఈ విషయాలు గమనించి వ్యవసాయం చేస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. –మాధవి, వ్యవసాయాధికారి, గుడిపాల